# మధురమీ విజయం





క్రికెట్..క్రికెట్ ఈ మూడు అక్షరాల పదానికి ఉన్న క్రేజ్ మాటలకందనిది! ఏ క్షణాన మన దేశానికి పరిచయం అయ్యిందో కానీ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగింది. సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో భారత్‌ది మరుపురాని అధ్యాయం. స్వాతంత్ర్యం రాక పూర్వం నుంచి నేటి ఏఐ యుగం వరకు దేశంలో క్రికెట్ ఒక మతంగా వర్ధిల్లుతూనే ఉన్నది. కాలం మారినా..తరాలు బదిలీ అవుతున్నా..ఆట పట్ల అభిమానం అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది. ఇది అంతా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తుందంటే..క్రికెట్ జగత్తును మరోమారు రంజింపచేస్తూ టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన వేళ జాతి యావత్తు సంబురాల్లో మునిగిపోయింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా గెలుపు సంబురాల్లో తేలిపోయారు. ఈ చిరస్మరణీయ విజయం వెనుక వెలకట్టలేని భావోద్వేగాలను ఎన్నో దాగున్నాయి. 2013 నుంచి నిన్న మొన్నటి వరకు అందినట్లే అంది చేజారుతున్న ఐసీసీ ట్రోఫీ ఎట్టకేలకు చెంతకు చేరడంపై ప్లేయర్లు ఎదుర్కొన్న బాధలు వారి చెమర్చిన కండ్లలోనే కనిపించాయి. 2014 టీ20 వరల్డ్‌కప్‌లో రన్నరప్ నుంచి మొదలుపెడితే స్వదేశం వేదికగా గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి వరకు మెగాటోర్నీలు మనల్ని ఊరిస్తూనే వచ్చాయి. కానీ కోట్లాది మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షలు ఫలించిన సమయాన కరీబియన్ గడ్డపై రోహిత్‌సేన కొత్త చరిత్ర లిఖించింది. కింగ్‌స్టన్ ఓవల్ మైదానంలో దక్షిణాఫ్రికాతో నువ్వానేనా అన్నట్లు సాగిన సమరంలో భారత్‌నే విజయం వరించింది. 17 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీమ్‌ఇండియా రెండోసారి కప్‌ను ముద్దాడింది. మెగాటోర్నీలో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ భారత్ అజేయంగా పొట్టి ప్రపంచకప్‌ను సగర్వంగా దక్కించుకుంది. ఐర్లాండ్‌తో పోరు నుంచి మొదలుపెడితే సఫారీలతో టైటిల్ ఫైట్ వరకు ఎక్కడా విశ్రమించకుండా మన వీరులు చూపించిన పోరాటం మాటల కందనిది.ఆఖరి టీ20 ప్రపంచకప్ ఆడిన విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మ, జడేజా కలను సాకారం చేసుకుని తమ కెరీర్‌కు ఘనమైన ముగింపు పలికారు.

**సమిష్టిగా సత్తాచాటుతూ:**

వెస్టిండీస్, అమెరికా వేదికలుగా దాదాపు నెలన్నర రోజుల పాటు సాగిన మెగాటోర్నీలో భారత్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. ఒక్క ప్లేయర్‌పైనే పూర్తిగా ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా కీలకంగా వ్యవహరిస్తూ జట్టు విజయాల్లో పాలుపంచుకున్నారు. ఐపీఎల్ ముగిసిన వారం రోజుల వ్యవధిలోనే అమెరికాలో అడుగుపెట్టిన భారత్..తమ లక్ష్యమేంటో చేతల్లో చూపెట్టింది. అగ్రరాజ్యంలో క్రికెట్ అభివృద్ధి కోసం ఐసీసీ రూపొందించిన ప్రణాళికలో 'డ్రాప్ ఇన్ పిచ్' రూపంలో ఇబ్బందులు ఎదురైనా మొత్తంగా మెగాటోర్నీ విజయవంతంగా ముగిసింది. ఒకానొక దశలో భారత జట్టుకు అనుకూలంగా ఐసీసీ షెడ్యూల్ ఉందని పలువురు మాజీలు అనవసర విమర్శలు చేసినా..మన టైటిల్ విజయాన్ని అడ్డుకోలేకపోయారు. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన విరాట్ కోహ్లీ..ఓపెనర్‌గా విజయవంతం కావడంలో విఫలమైనా..మేనేజ్‌మెంట్ అతనిపై ఎనలేని విశ్వాసాన్ని ఉంచింది. ఇది కెప్టెన్ రోహిత్‌శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్ మాటల్లో చాలా స్పష్టంగా కనిపించింది. కోహ్లీ..టైటిల్ ఫైట్‌లో తన విలువేంటో చూపెట్టాడు. ఇలా తమ పాత్రలకు న్యాయం చేస్తూ బ్యాటింగ్‌లో రోహిత్, పంత్, సూర్యకుమార్, హర్దిక్ బాధ్యాతాయుత ఇన్నింగ్స్‌లతో కదం తొక్కితే..బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్, కుల్దీప్, అక్షర్ సమయోచితంగా వ్యవహరించారు.

**ఐసీసీ మెగా టోర్నీల్లో**

| | | |
|---|---|---|
| టీ20 ప్రపంచకప్ | 2014 | రన్నరప్ |
| వన్డే వరల్డ్‌కప్ | 2015 | సెమీస్ |
| టీ20 ప్రపంచకప్ | 2016 | సెమీస్ |
| చాంపియన్స్ ట్రోఫీ | 2017 | రన్నరప్ |
| వన్డే వరల్డ్‌కప్ | 2019 | సెమీస్ |
| టీ20 వరల్డ్‌కప్ | 2022 | సెమీస్ |
| వన్డే వరల్డ్‌కప్ | 2023 | రన్నరప్ |

## స్పిన్ తంత్రం.. పేస్ మంత్రం..

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

'నాకు నలుగురు స్పిన్నర్లు కావాలి. మేము అక్కడ (వెస్టిండీస్) చాలా క్రికెట్ ఆడాం. నలుగురు స్పిన్నర్లను ఎందుకు ఎంపిక చేశారన్నదానికి కారణాలను నేనిప్పుడు వెల్లడించను. అమెరికాకు వెళ్లాక చెబుతా..' టీ20 ప్రపంచకప్ కోసం అమెరికా విమానమెక్కబోయే ముందు చీఫ్ సెలక్టర్ అగార్కర్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్ అన్న మాటలవి. ఆ తర్వాత దీని గురించి ఎవరూ రోహిత్‌ను ఈ ప్రశ్న అడగకపోయినా ఫలితాలు మాత్రం కండ్ల ముందే కనిపిస్తున్నాయి. ఈ టోర్నీలో ఫైనల్ చేరాలంటే ఇంగ్లండ్‌తో జరిగిన కీలక సెమీస్ మ్యాచే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. గయానా పిచ్‌పై అక్షర్, కుల్‌దీప్ చేసిన స్పిన్ మాయకు బట్లర్ సేనకు కండ్లు బైర్లు కమ్మాయి. సూపర్8 దశ నుంచి 'స్పిన్నర్లు భారత్‌కు మ్యాచ్ విన్నర్లు'గా మారారు. పేస్‌కు అనుకూలించిన అమెరికా పిచ్‌లపై కుల్దీప్‌ను పక్కనబెట్టిన భారత్.. తదుపరి దశలో మాత్రం అతడిని తుదిజట్టులోకి రప్పించి అనూహ్య ఫలితాలు రాబట్టింది. ఫైనల్ మ్యాచ్‌లో మినహాయిస్తే అంతకుమునుపు 4 మ్యాచ్‌లలో అతడు 10 వికెట్లు పడగొట్టాడు. తుది పోరులో అంతగా ఆకట్టుకోకపోయినా ఈ టోర్నీలో అతడు 9 వికెట్లు తీయడంతో పాటు బ్యాట్‌తోనూ రాణించగా సౌతాఫ్రికాతో ఫైనల్‌లోనూ జట్టును ఆదుకున్నాడు. భారత విజయాల్లో పేసర్లదీ కీలకపాత్రే. ఈ టోర్నీలో అత్యధిక వికెట్ల వీరులలో అర్ష్‌దీప్ (17)దే అగ్రస్థానం. ఇక 'మోస్ట్ ట్రస్టెడ్ బౌలర్' జస్‌ప్రీత్ బుమ్రా 15 వికెట్లు తీసి భారత విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. టోర్నీ ఆసాంతం భారత్‌కు వికెట్ కావాలనుకున్న ప్రతీసారి రోహిత్.. బుమ్రా వైపునకే చూశాడు. ఫైనల్‌లో భారత్ హీరో హార్దిక్ (11) సైతం అటు బ్యాట్‌తో ఇటు బంతితోనూ ఆల్ రౌండ్ ప్రదర్శన చేశాడు.

## నందినికి స్వర్ణం

**జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ టోర్నీ**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: పంచకుల(హర్యానా) వేదికగా జరుగుతున్న 63వ జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్ అగసర నందిని పసిడి పతకంతో మెరిసింది. ఆదివారం జరిగిన మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన నందిని 5806 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ నందిని మొత్తం ఏడు ఈవెంట్లలో సత్తాచాటింది. 100మీటర్ల హర్డిల్స్ రేసును 13.93 సెకన్లలో, హైజంప్‌లో 1.64మీటర్లు, షాట్‌పుట్‌లో 14.56 మీటర్ల నందిని స్వర్ణం సాధించింది.

## టీ20లకు జడేజా గుడ్‌బై

బ్రిడ్జ్‌టౌన్: భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా..అంతర్జాతీయ టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఇప్పటికే పొట్టి ఫార్మాట్‌కు రోహిత్, కోహ్లీ గుడ్‌బై చెప్పగా తాజాగా జడేజా కూడా ఈ జాబితాలో చేరిపోయాడు. ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జడేజా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. 'అంతర్జాతీయ టీ20లకు హృదయపూర్వకంగా వీడ్కోలు పలుకుతున్నాను. దేశం తరపున అత్యుత్తమంగా రాణించేందుకు ప్రయత్నించాను. భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో రాణిస్తాను' అని రాసుకొచ్చాడు. తన కెరీర్‌లో 74 మ్యాచ్‌లాడిన జడేజా 515 పరుగులతో పాటు 54 వికెట్లు పడగొట్టాడు.

## ఫాలోఆన్‌లో సఫారీలు

చెన్నై: భారత్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో దక్షిణాఫ్రికా మహిళల జట్టు ఫాలోఆన్ ఆడుతున్నది. ఒకే రోజు మిగిలున్న ఆటలో మూడో రోజు ఆట ముగిసే సరికి రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 2 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. సునె లుస్(109) సెంచరీతో ఆకట్టుకోగా, కెప్టెన్ వోల్వార్డ్(93 నాటౌట్) అర్ధసెంచరీ చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 266కు ఆలౌటైంది.



## టీమ్ ఇండియాకు 125 కోట్లు

- బంపర్ ప్రైజ్‌మనీ ప్రకటించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత క్రికెటర్లపై కనకవర్షం కురుస్తున్నది. సుదీర్ఘ కలను సాకారం చేసుకుంటూ కరీబియన్ గడ్డపై కొత్త చరిత్ర లిఖించిన టీమ్ ఇండియాపై ఓ వైపు ప్రశంసలతో పాటు నగదు ప్రోత్సాహకాల పరంపర కొనసాగుతున్నది. 17 ఏండ్ల తర్వాత టీ20 ప్రపంచకప్‌ను దేశానికి అందించిన టీమ్‌ఇండియా క్రికెటర్లకు బీసీసీఐ ఏకంగా రూ.125 కోట్ల బంపర్ ప్రైజ్ మనీ ప్రకటించింది. ఈ విషయాన్ని బోర్డు కార్యదర్శి జై షా ఆదివారం అధికారికంగా ప్రకటించారు. బార్బడోస్ వేదికగా దక్షిణాఫ్రికాతో హోరాహోరీగా సాగిన ఫైనల్లో రోహిత్‌సేన చిరస్మరణీయ విజయం సాధించిన వేళ షా..ఎక్స్‌లో స్పందిస్తూ 'రోహిత్‌శర్మ అసమాన నాయకత్వంలో భారత్ అద్భుత పోరాటపటిమ కనబరిచింది. అపజయమెరుగకుండా టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన తొలి జట్టుగా టీమ్‌ఇండియా నిలిచింది. అద్భుతమైన ప్రదర్శనతో విమర్శలకు దీటైన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ గెలిచిన జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటిస్తున్నాం' అని అన్నాడు.

**వెల్ డన్ బాయ్స్..!**





ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత క్రికెటర్లను ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. కెప్టెన్ రోహిత్‌శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్‌కోహ్లీ, చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో స్వయంగా ఫోన్‌లో మాట్లాడిన మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణలో క్రికెట్‌కు కొత్త జోష్

**త్వరలో కొత్త స్టేడియాల నిర్మాణం • హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయాలు**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: బీసీసీఐ సహకారంతో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం జరిగిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ 'తెలంగాణ క్రికెటర్ల శ్రేయాస్సును దృష్టిలో పెట్టుకుని హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా మాజీ క్రికెటర్ వెంకటేశ్‌ప్రసాద్ నియమించేందుకు చర్చలు జరుపుతున్నాం. జిల్లా కేంద్రాల్లోనూ స్టేడియాల నిర్మాణానికి కసరత్తు మొదలుపెట్టాం' అని అన్నారు. ఈనెల 8 నుంచి దేశవాళీ క్రికెట్ మొదలవుతుందని కార్యదర్శి దేవరాజ్ పేర్కొన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్‌ను క్లియర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

---

## పాతబస్తీ నేపథ్య కథలో..?




గత ఏడాది 'దసరా' చిత్రంతో హీరో నాని భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. తొలి చిత్రంతోనే దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ కాంబినేషన్‌లో మరో చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'దసరా' నిర్మాత సుధాకర్ చెరుకూరి రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. కొద్ది మాసాల క్రితం విడుదల చేసిన ఈ చిత్ర ప్రీలుక్ పోస్టర్ అందరిలో ఆసక్తినిరేకెత్తించింది. ఈ సినిమా కూడా 'దసరా' తరహాలోనే సింగరేణి నేపథ్య కథాంశమని ప్రచారం జరిగింది. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం హైదరాబాద్‌లో పాతబస్తీ నేపథ్యంలో కథ నడుస్తుందని, మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా బలమైన భావోద్వేగాలతో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్క్రిప్ట్ సిద్ధం చేశారని అంటున్నారు. ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' చిత్రంలో నటిస్తున్నారు. ఇది పూర్తికాగానే శ్రీకాంత్ ఓదెల చిత్రం పట్టాలెక్కనుంది.

## వరుణ్‌తేజ్ 'ఏఐ' లవ్‌స్టోరీ?



ప్రస్తుతం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సమాజంలోని అన్ని రంగాలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నది. సినీ రంగంలో కూడా ఏఐ సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ సాంకేతికత ప్రధానంగా తెలుగులో ఓ లవ్‌స్టోరీ రానుందని వార్తలొస్తున్నాయి. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. దాదాపు రెండు సంవత్సరాల పాటు పరిశోధన చేసి దర్శకుడు ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశారని, కాన్సెప్ట్‌లో కొత్తదనం నచ్చడంతో వరుణ్‌తేజ్ ఈ సినిమాకు గ్రీన్ ఇచ్చారని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుందని సమాచారం. ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు. ప్రస్తుతం వరుణ్‌తేజ్ 'మట్కా' చిత్రంలో నటిస్తున్నారు. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ పీరియాడిక్ ఫిల్మ్ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది.

## 'మిస్టర్ ఎక్స్' యాక్షన్



ఆర్య, గౌతమ్ కార్తీక్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఆదివారంతో చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'యాక్షన్ ప్రధానంగా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఉగాండా, అజర్‌బైజాన్, జార్జియా వంటి దేశాల్లో చిత్రీకరణ జరిపాం. పోరాట ఘట్టాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి' అన్నారు. శరత్‌కుమార్, మంజు వారియర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తన్వీర్ దిబు, సంగీతం: దిబు నివాస్ థామస్.

**చిత్రం**

## భయమేసి బయటకు పరుగు తీశాను



చీకటి గదిలో సన్నివేశం తీస్తుంటే.. భయమేసి బయటకు పరిగెత్తుకొచ్చిందట 'అర్జున్‌రెడ్డి' భామ షాలినీ పాండే. ఈ అందాలభామ నటించిన 'మహరాజ్' సినిమా ఇటీవలే ఓటీటీలో విడుదలై అద్భుతమైన ఆదరణ పొందుతున్నది. జునైద్‌ఖాన్, జైదీప్ అహ్లావ్ హీరోలుగా నటించిన ఈ చిత్రాన్ని సిద్ధార్థ్ మల్హోత్రా తెరకెక్కించారు. ఈ సినిమా విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూలో షూటింగ్ సమయంలో జరిగిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది షాలిని. '1800 కాలంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన సినిమా ఇది. ఇందులో నా కేరక్టర్ పేరు 'కిషోరి'. అద్భుతమైన పాత్ర. కథానుగుణంగా ఓ రొమాంటిక్ సన్నివేశాన్ని తీస్తున్నారు సిద్ధార్థ్ మల్హోత్రా. చీకటి గదిలో తీస్తున్న ఫీల్ రావడానికి నేచురల్ లైటింగ్‌నే వాడారు. నాకేమో చీకటి అంటే భయం. ఆ సీన్ చేస్తున్నప్పుడు ఒక్కసారిగా భయం వేసింది. లేచి బయటికి పరుగు తీశాను. నా పరిస్థితిని గమనించిన దర్శకుడు సిద్ధార్థ్ చుట్టూ ప్రశాంతమైన వాతావరణాన్ని సెట్ చేసి, నాకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా షూట్ చేశారు. ఆ సందర్భాన్ని తలచుకుంటే నిజంగా నవ్వొస్తుంది' అంటూ చెప్పుకొచ్చింది షాలిని.



## అందుకే 'రోబో'ను తిరస్కరించా!

రజనీకాంత్ హీరోగా శంకర్ రూపొందించిన సైన్స్ ఫిక్షన్ చిత్రం 'రోబో' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడంతోపాటు సరికొత్త సాంకేతిక హంగులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. తొలుత ఈ చిత్రాన్ని కమల్‌హాసన్‌తో తీయాలని దర్శకుడు శంకర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అనంతరం రజనీకాంత్‌తో తెరకెక్కించి అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'భారతీయుడు-2' ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న కమల్‌హాసన్ 'రోబో' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఆ సినిమాలో తాను నటించకపోవడానికి కారణాలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ ''ఐ-రోబో' అనే ఇంగ్లీష్ నవలను సినిమాగా తీస్తే బాగుంటుందని రచయిత సుజాతతో పాటు నేను, దర్శకుడు శంకర్ 90దశకంలోనే ప్రయత్నాలు చేశాం. నా లుక్‌టెస్ట్ కూడా జరిగింది. అయితే అప్పటి మార్కెట్ లెక్కల ప్రకారం అంతటి భారీ బడ్జెట్‌తో సినిమా తీయడం సేఫ్ కాదనిపించింది. దాంతో ఆ ప్రాజెక్ట్‌ను విరమించుకున్నాను. అయితే శంకర్ మాత్రం కొన్నేళ్లపాటు ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేసి సరైన టైమ్‌లో సినిమా తీసి విజయం సాధించారు' అని తెలిపారు.

## అతని గతం ఏమిటి?



విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకుడు. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. జూలైలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం ట్రైలర్ రిలీజ్ చేశారు. ఎవరి గతంలో లేని హీరో, మరొకరి భవితగా ఎలా మారాడనే ఆసక్తికరమైన అంశంతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా తెలియజేశారు. అజ్ఞాతవాసంలో ఉన్న హీరోను ఓ కుటుంబం ఆదరిస్తుంది. మరోవైపు ఓ పోలీస్ అధికారి అతని కోసం గాలిస్తుంటాడు. తనను ఆదరించిన ఫ్యామిలీ కోసం హీరో ఏం చేశాడు? పోలీసులు అతన్ని వెంటాడటానికి కారణాలేమిటి? అసలు అతని తాలూకు గతం ఏమిటి? అనే అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిని పెంచింది. విజయ్ ఆంటోని గత చిత్రాల తరహాలోనే ఇదొక విభిన్నమైన కథాంశమని దర్శకుడు తెలిపారు. శరత్‌కుమార్, మేఘా ఆకాష్, మురళీశర్మ, పృథ్వీ అంబర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని, రచన-సినిమాటోగ్రఫీ-దర్శకత్వం: విజయ్ మిల్టన్.

## ఎవడి కోసం తగ్గాలి



అల్లరి నరేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకుడు. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. అమృత అయ్యర్ కథానాయిక. సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం అల్లరి నరేష్ జన్మదినం సందర్భంగా ఫస్ట్‌గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన పూర్తి మాస్ అవతారంలో కనిపించారు. యాక్షన్, ఎమోషనల్ కంటెంట్‌తో గ్లింప్స్ ఆకట్టుకుంది. 'ఏయ్..ఎవడి కోసం తగ్గాలి. ఎందుకు తగ్గాలి..' అంటూ అల్లరి నరేష్ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. అల్లరి నరేష్ ఇంతవరకు ఈ తరహా మాస్ క్యారెక్టర్ చేయలేదని, ఆయన కెరీర్‌లో ప్రత్యేక చిత్రంగా నిలిచిపోతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్ ఎమ్ నాథన్, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, కథ, మాటలు, దర్శకత్వం: సుబ్బు మంగదేవి.

**సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త చిత్రం**

అల్లరి నరేష్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త చిత్రాన్ని ప్రకటించింది. మోహర్‌తేజ్ దర్శకత్వం వహిస్తారు. ఆదివారం కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అనే క్యాప్షన్‌తో పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. విభిన్నమైన పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, అల్లరి నరేష్ పాత్ర వైవిధ్యంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

## లక్ష్యసాధన కోసం



ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ఆదివారం కథానాయిక అవికాగోర్ పుట్టినరోజుని పురస్కరించుకొని ఆమె లుక్‌ని రివీల్ చేస్తూ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని వినూత్న కథాంశమిది. గ్రాఫిక్స్ ప్రధానంగా విజువల్ వండర్‌లా ఉంటుంది. అవికాగోర్ సర అనే ధైర్యవంతురాలైన అమ్మాయి పాత్రలో కనిపిస్తుంది. ఆమె చేసే సాహసాలు స్ఫూర్తివంతంగా అనిపిస్తాయి. హీరోకు తోడుగా అతని లక్ష్యసాధనకు సహాయం చేసే అమ్మాయిగా కథాగమనంలో ఆమె పాత్ర కీలకంగా ఉంటుంది. ఆది సాయికుమార్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలిచే చిత్రమవుతుంది' అన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.